క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

కేజీహెచ్ ఏడీగా సుమతి బాధ్యతల స్వీకరణ



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను కలిసిన ఏడీ సుమతి

మహారాణిపేట: కేజీహెచ్ పరిపాలనా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పరిపాలనాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఏడీ సుమతిని పలువురు ఉద్యోగులు అభినందించారు.

అనాథాశ్రమానికి వృద్ధురాలు



వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పిస్తున్న పోలీసులు

డాబాగార్డెన్స్: పోలీస్ కమిషనర్ చొరవతో ఓ వృద్ధురాలిని పాతనగరంలో గల స్వామి వివేకానంద అనాథాశ్రమంలో నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం చేర్పించారు. వారం రోజులుగా రైల్వే స్టేషన్‌లో ఉంటున్న వృద్ధురాలి గురించి కొంత మంది స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సీపీ సూచనల మేరకు నాలుగో పట్టణ పోలీసులు ఆమెను అనథాశ్రమంలో చేర్పించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆమె వివరాలు అడగ్గా తన పేరు తిప్పలూరు దేవి అని, ఒడిశాలోని బరంపురం దగ్గర పాత్రపురంలో కుమారుని వద్ద ఉండేదానినని చెప్పింది.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు.

ప్రజల భాగస్వామ్యంతో..

స్వచ్ఛభారత్ సాధన





జగదాంబ: జీవీఎంసీ పరిధిలో మురికివాడలు, సమస్యలు అధికంగా ఉన్నది జోన్–4లో. ఈ జోన్‌కు కమిషనర్‌గా వచ్చిన మల్లయ్యనాయుడు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ స్వచ్ఛభారత్, రెవెన్యూ వసూళ్లు, ఎపిడమిక్ సీజన్ తర్వాత కూడా మురికివాడల్లో ప్రబలుతున్న ప్రాణాంతకమైన డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణ, దోమల అడ్డుకట్టకు జరుగుతున్న యాంటీ లార్వా ఆపరేషన్లు, పర్యావరణ పరిరక్షణ, హానికారక ప్లాస్టిక్ కవర్ల నిషేధం వంటి పలు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో 'సాక్షి' జరిపిన ఇంటర్వ్యూ.

ప్రశ్న : స్వచ్ఛ భారత్ నేపథ్యంలో మురికివాడలు ఎక్కువగా ఉన్న జోన్–4లో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు : స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం. రోజూ ఉదయం అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నాం. రెల్లివీధి, జాలరిపేట, పూర్ణామార్కెట్, జగదాంబ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా వచ్చే చెత్తను రహదారిపై లేకుండా యార్డుకు తరలిస్తున్నాం. మార్కెట్ల వద్ద డస్ట్‌బిన్‌లు పెట్టి చెత్త సేకరిస్తున్నాం.

ప్రశ్న : ఈ ఏడాది సీజనల్ వ్యాధుల తర్వాత కూడా జోన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలాయి. అక్కడ ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : వార్డుల్లో మురుగు కాలువలు, గెడ్డలు శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడ నీటి ప్రవాహం ఆగిపోతుందో అక్కడ పారిశుధ్య కార్మికులతో పనులు చేయించి మురుగు నీరు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీని వల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి. వ్యాధుల తీవ్రత తగ్గుతుంది. మలేరియా సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. సీజనల్ వ్యాధుల కాలంలోనే కాకుండా ప్రతిరోజూ యాంటీలార్వా ఆపరేషన్లు చేసి దోమల వృద్ధిని అరికడుతున్నాం.

ప్రశ్న : స్వచ్ఛ విశాఖ లక్ష్యంగా ప్రజలకు మీరిచ్చే సలహా..

జవాబు : స్వచ్ఛ విశాఖ లక్ష్యంగా అందరం కలిసి పని చేద్దాం. మన ఇల్లు, మన పరిసరాలు, మన ఆరోగ్యం వంటి లక్ష్యంతో ముందుకు వెళ్తే లక్ష్యం సాధిస్తాం. ఇందుకు ఇప్పటికే ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. క్లాప్ వాహనాల ద్వారా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరిస్తున్నాం. ప్రజల నుంచి స్పందన బాగుంది.

ప్రశ్న : ఈ ఏడాది రెవెన్యూ వసూళ్లకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ఇప్పటికే జోన్ పరిధిలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేశాం. టార్గెట్ల ద్వారా లక్ష్యం సాధిస్తాం. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఎక్కువ మొత్తం వసూలుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకు జీవీఎంసీ ప్రచార రథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇంటి పన్నులు, నీటి, ఖాళీ స్థలాల పన్ను నిర్ణీత సమయంలో చెల్లించి వడ్డీల బారిన పడొద్దని ప్రజలకు చెబుతున్నాం.

ప్రశ్న : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ఎంత వరకు వచ్చింది?

జవాబు : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దాదాపుగా అరికట్టాం. ప్లాస్టిక్ నిషేధంపై చేసిన ప్రచారం వ్యాపారులు, ప్రజల్లోకి వెళ్లింది. దాని వల్ల దుకాణాల్లో కవర్ల అమ్మకాలు తగ్గాయి. జీవీఎంసీ సూచించిన పేపర్ ప్లేట్లు, గ్లాసులు, చెరకు పిప్పి, అరటితో తయారు చేసిన ప్లేట్లు, గన్నీ బ్యాగ్‌లు విక్రయిస్తున్నారు. జోన్ పరిధిలో సిబ్బందిని బృందాలుగా నియమించి దుకాణాలపై ఆకస్మిక దాడులు చేయిస్తున్నాం. ఈ దాడుల్లో పట్టుకున్న కవర్లతో పాటు ఆయా వ్యాపారులపై అపరాధ రుసుము విధిస్తున్నాం. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నిషేధిత కవర్లు విక్రయించే దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : వార్డు సెక్రటరీల కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో కంప్యూటర్లు, ట్యాబ్‌లు, జిరాక్స్ మిషన్లు, తెల్ల కాగితాలు, పెన్నులు, పిన్నుల వంటి అత్యవసర సామగ్రి లేకపోవడంతో సెక్రటరీలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారు.

జవాబు : ప్రస్తుతానికి అటువంటి ఇబ్బందులు లేవు. అన్ని కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో కంప్యూటర్లు, ట్యాబ్‌లు, జిరాక్స్ మిషన్లు ఉన్నాయి. మిగిలిన సామగ్రికి కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతినెల ఫండ్ వస్తుంది. గతంలో కార్యాలయం అడ్మిన్లు బిల్లులు పెట్టకపోవడం వల్ల ఆలస్యం అయిన విషయం వాస్తవమే. ఇప్పుడు ఆ సమస్య లేదు. వార్డు సెక్రటరీల కార్యాలయాలకు ఎటువంటి సమస్యలు లేవు.

క్యాడెట్లకు అభినందన



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు శరగడ కిరణ్మయి, గాయత్రి బెహరా ఈ నెల 16 నుంచి 23 వరకు గుంటూరు జిల్లా కొండవీడు కోట పరిసర ప్రాంతాల్లో అఖిల భారత సీనియర్ వింగ్ ట్రెక్కింగ్ క్యాంపును విజయవంతంగా ముగించారు. క్యాంపులో వీరు పర్వతాలను అధిరోహించేందుకు శిక్షణ పొందారు. చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించారు. తారా బుర్జు, నెమలి బుర్జు, స్నేక్ రోడ్, తూర్పు ద్వారం, ఎలిఫ్యాంట్ రూట్, కొండవీడు కోట, కొండపల్లి కోట, రెడ్డి కింగ్స్ హెరిటేజ్ మ్యూజియం, కొండపల్లి మ్యూజియం వంటి ప్రాంతాలను సందర్శించి చారిత్రాత్మక, సాంస్కృతిక అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల శుక్రవారం క్యాడెట్లను అభినందిస్తూ ఇటువంటివి మరెన్నో కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని అభిలషించారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి పదోన్నతులు



పదోన్నతి పొందిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో ఏడుగురు పోలీస్ సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్‌ఐలుగా, ఒక జూనియర్ అసిస్టెంట్ సీనియర్ అసిస్టెంట్‌గా, ముగ్గురు పీసీలు హెచ్‌సీలుగా, ఒక మహిళా పీసీ హెచ్‌సీగా పదోన్నతి పొందారు. శుక్రవారం వీరిని కుటుంబ సభ్యులతో పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. పదోన్నతి ర్యాంకులతో పాటు పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు.

వీధుల్లో పారిశుధ్య పనులు



రంగిరీజు వీధిలో చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వార్డుల్లోని వీధులను పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన జోన్ పరిధి పూర్ణామార్కెట్ నుంచి వన్ టౌన్ ప్రధాన రహదారి, 36వ వార్డు రంగిరీజువీధి ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన రహదారుల్లోని కాలువల్లో ఉన్న చెత్త ,బాటిళ్లు, వీధుల్లోని చెత్తను సిబ్బందితో ఎత్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది రోజూ వీధుల్లో చెత్తతో పాటు రోడ్లపై చెత్త ఎత్తాలన్నారు. సెక్రటరీలు వార్డుల్లోకి వచ్చి సిబ్బందితో పనులు చేయించాలన్నారు. క్లాప్ వాహనాల్లో చెత్త వేయడానికి వీల్లేకపోతే ప్రత్యేకంగా యార్డు నుంచి వాహనాలు తీసుకొచ్చి చెత్త తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాగంటి ప్రవచనాలు



ప్రవచనాల కరపత్రం ఆవిష్కరిస్తున్న చాగంటి కుమారుడు షణ్ముఖ చరణ్ తదితరులు

మధురవాడ: సంపూర్ణ రామాయణంపై ప్రముఖ ప్రవచన కర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి 6వ తేదీ వరకు 42 రోజులు ఈ ప్రవచనాలు ఉంటాయని ఆయన కుమారుడు షణ్ముఖ చరణ్, గాయత్రీ విద్యా పరిషత్ కార్యదర్శి సోమరాజు, అష్టలక్ష్మి ఆలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ వెల్లడించారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రవచనాల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. వాల్మీకి రామాయణంలో ఆరు ఖండాలను, ఒక్కో ఖండంపై వారం రోజుల పాటు చాగంటి ప్రవచిస్తారని వివరించారు. శ్రీ అష్టలక్ష్మి, వైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రీ విద్యా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్మవర్ధిని సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని, సుందరకాండ, సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం తదితర ముఖ్య ఘట్టాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించిన రామయంత్రం ఇప్పటికే ఇక్కడ చేరుకుందన్నారు. గాయత్రీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ జి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడిని అనాథాశ్రమానికి చేర్చిన వాట్సాప్ గ్రూప్



ఏయూటీడీ కార్యదర్శి వాసుతో దివ్యాంగుడు చంటి

సీతమ్మధార: ఎవరూ లేని అనాథ దివ్యాంగుడు జెర్రిపోతుల చంటి (35) గురించిన వివరాలను వాట్సాప్ గ్రూప్‌లో పెట్టడంతో వెంటనే స్పందన వచ్చింది. అతను యలమంచిలి దగ్గర పేటబయ్యవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి ఆ వాట్సాప్ గ్రూపులో ఉన్న ప్రగడ వెంకటరావు, ప్రగడ శేషు ఫోన్ ద్వారా ఏయూటీడీకి సమాచారం ఇచ్చారు. యలమంచిలి నుండి వచ్చిన శేషుకు మార్‌కు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో చంటిని శుక్రవారం క్షేమంగా అప్పగించారు. ఇతనికి ఎవరూ లేరని, తీసుకెళ్లి అక్కడున్న అనాథాశ్రమంలో చేర్పించి చూసుకుంటామని వారు హామీ ఇచ్చారు. దివ్యాంగుడిని అప్పగించిన ఏయూటీడీ కార్యదర్శి వాసుకి వారు ధన్యవాదాలు తెలిపారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించండి



సమస్య పరిష్కరించాలంటూ చీఫ్ సిటీ ప్లానర్ వద్ద మొర పెట్టుకుంటున్న ఫిర్యాదీదారు

డాబాగార్డెన్స్: టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై పట్టణ ప్రణాళికా సిబ్బంది స్పందించి వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఆదేశించారు. కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి పరిష్కారానికై సంబంధిత అధికారులను ఆదేశించారు.

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పురస్కారం అందుకుంటున్న ఆరిపాక విద్యార్థులు

భీమునిపట్నం/సబ్బవరం: విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో ఉమ్మడి విశాఖకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. డిజిటల్ కళాల కేటగిరీలో పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.చరణ్‌రాజ్, రంగోలి పోటీల్లో భీమిలి కేజీబీవీకి చెందిన కె.ఉమాదేవి, కె.జ్యోత్స్న, స్లోగన్ రైటింగ్ పోటీలో పద్మనాభం కేజీబీవీకి చెందిన కె.సుప్రియ, రోల్‌ప్లే పోటీలో సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఆరిపాక ఆంగ్ల ఉపాధ్యాయురాలు బి.వి.రామలక్ష్మి రచించిన 'భువన విజయం' అనే నాటకాన్ని 9వ తరగతి విద్యార్థినులు ఎ.ఉమాదేవి, జె.దివ్యధరణి, పి.హిందువదన చక్కగా ప్రదర్శించారు. సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా విజేతలు పురస్కారం, ప్రశంసాపత్రం స్వీకరించారు. విజేతలను భీమిలి జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ జ్యోతికుమారి అభినందించారు.

31న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 31న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణమండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు నగరంలో గల అన్ని వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజీకుమార్, సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ కట్టమూరి సూర్యనారాయణ, కో చైర్మన్ దుర్గా నూకేశ్వరరావు మాట్లాడారు. పైన పేర్కొన్న అన్ని సంఘాల ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆ రోజు వేకువజాము 3 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక క్షీరాభిషేకం, ఉదయం 6.30 గంటలకు టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు 102 మంది ఆర్యవైశ్య దంపతులచే వివిధ రకాల పుష్పాలతో ఊరేగింపు, 7.30 గంటలకు మూల విరాట్టుకు ప్రత్యేకంగా ఆత్మార్పణ అలంకరణ, ఉత్సవ విగ్రహానికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం, 8 గంటలకు స్వర్ణపుష్పార్చన, సహస్రనామ కుంకుమార్చన, 102 దీపాలతో మంగళ హారతి, 10.30 గంటలకు వాసవీ మూలమంత్రహోమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ఆర్‌ఎం అభినందనలు



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: ఆర్టీసీ డ్రైవర్లకు గులాబీలు ఇచ్చి ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు అభినందించారు. డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ద్వారకా బస్టేషన్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ డ్రైవర్ వ్యవస్థ చాలా ప్రధానమైనదని పేర్కొన్నారు. రోజుకు వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చడంలో డ్రైవర్లు చిత్త శుద్ధితో విధులు నిర్వర్తిస్తారని కొనియాడారు. డ్రైవర్లు తమ విధులను దైవంగా భావించి, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా రాత్రీపగలు తేడా లేకుండా విధులు నిర్వర్తించడం గొప్ప విషయం అన్నారు. భారత ప్రభుత్వం డ్రైవర్ల కోసం ఒక రోజును ప్రత్యేకంగా ప్రకటించడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ద్వారకాబస్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతో బంగారు భవిష్యత్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో అన్న నినాదంతో అందరూ పని చేయాలన్నారు. ఎక్కడా లింగభేదం ఉండరాదన్నారు. బాలికలు చదువుకోవడం వల్ల ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. అలాగే కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి(డెమో) ఎం.నాగేశ్వరరావు, ఇతర వైద్య విభాగాల పర్యవేక్షకులు, వివిధ శాఖల అధికారులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, రీజినల్ ట్రైనింగ్ సెంటర్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిల్వ నీటిలో దోమల వృద్ధి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సీతంపేట: మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ పి.వై.ఎస్.రత్నం అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులకు పైగా నిల్వ ఉన్న మంచినీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస రెడ్డి, ఏఎన్ఎం గ్రేసీ, ఆశాకార్యకర్త ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు చెందిన పర్యాటక కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ నిర్వహణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీయూ 142, సీ హ్యారియర్ మ్యూజియాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, పాడైన లైట్లను పునరుద్ధరించాలని, అదనపు టాయిలెట్లు ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ సందర్శనార్థం వచ్చిన స్కూల్ పిల్లలు, అధ్యాపకులతో ముచ్చటించి పార్క్‌లో కల్పించిన వసతుల కోసం ఆరా తీశారు. అదేవిధంగా టీయూ యుద్ధ విమాన మ్యూజియం ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసేలా చూడాలన్నారు. యూహెచ్3హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. తాటిచెట్లపాలెం కల్యాణమండపం నిర్వహణకు త్వరగా టెండర్లు పిలిచి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ పర్యటనలో వీఎంఆర్డీఏ సీఈ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు, డీఎఫ్‌వో శివాని తదితరులు పాల్గొన్నారు.